# నేను గొప్పవాడ్ని



## శ్రీనివాస తనయ

వేసవికాలం. మిట్టమధ్యాహ్నపు ఎండ తీవ్రంగా ఉంది. సూర్యునికి భయపడి మేఘాలన్నీ ఏ దూరతీరాలకు పారి పోయాయో, ఆకాశంలో ఎక్కడా చిన్న మేఘంకూడా లేదు. ఎండతీవ్రతకి భయపడి జనంకూడా ఇళ్ళలోనే ఉండి పోయారేమో వీధులన్నీ నిర్మానుష్యంగా ఉన్నాయి.

గుమ్మంలో నిలబడి రోడ్డుమీదికి చూస్తూన్న లక్ష్మి కన్నులనిండా ఆత్రుత! కంగారు! దూరంగా వంటరిగా నడిచి వస్తున్న రామనాథాన్ని చూసి రెట్టించిన కంగారులో అతనిదగ్గరకు పరుగులాంటి నడకతో చేరుకుంది.

"చిట్టి....చిట్టి....ఏది?"

సమాధానం చెప్పలేనట్టుగా తలవంచుకున్నాడు రామనాథం.

"మాట్లాడరేం? మన పాప....కనిపించలేదూ?" కనిపించలేదన్న సంగతి అర్థమవుతున్నా, ప్రశ్నించడం తన ఆందోళన తెలియపరచడానికే!

"కనిపిస్తుందిలే, వెతుకుతారు! నువ్వు లోపలికి పద." మనసులో అతనికీ చెప్పలేనంత భయంగా బాధగా ఉన్నా, ఆమెని ఊరడించడం తన కర్తవ్యమని గుర్తించినట్టున్నాడు.

"ఏమిటి మీరంటున్నది?.... ఎవరు వెతుకుతారు?....పాపని తీసుకురాకుండా మీ రెందుకు వచ్చేశారు? అసలు చిట్టి ఏమైంది? అయ్యో ...చిట్టీ ఎక్కడున్నావు? ఏమైపోయావు?" గట్టిగా ఏడవడం మొదలుపెట్టిన ఆమెను బలవంతాన ఇంట్లోకి నడిపించుకు వచ్చి మంచంమీద కూర్చోబెట్టాడు రామనాథం.

"చుట్టుపక్కల చాలాదూరం వెతికాను లక్ష్మీ, పాప ఎక్కడా కనిపించలేదు. పోలీస్‌స్టేషనులో రిపోర్టుఇచ్చి వచ్చాను. వెతుకుతామన్నారు. ఈ ఎండ కొద్దిగా తగ్గాక ఎవరినైనా రమ్మని మళ్ళీ నాలుగు ప్రక్కలా వెతుకుతాను. ఇంత ఎండలో ఎవరిని రమ్మన్నా రారు. నువ్వు కంగారు పడకు. ఈ రోజు ఏ యాక్సిడెంట్లూ జరగ

లేదని పోలీసులు చెప్పారు. మన చిట్టి ఎక్కడో క్షేమంగానే ఉంటుంది.'' తను బాధపడుతున్నట్లు తెలియనీయకుండా పాఠం అప్పచెప్పినట్లుగా చెప్పాడు.

''పోలీసులు వెతుకుతారని ఇంటికి వచ్చేశారా? మనలాంటివాళ్ళ పాపకోసం వాళ్ళు శ్రద్ధగా వెతుకుతారా? ఇంత ఎండలో.... ఈ గాడ్పులో.... ఆకలితో చిట్టితల్లి ఎక్కడ ఉందో?.... ఏమై పోయిందో.... ఎవరో ఎప్పుడో వెతుకుతారని మనం ఇంట్లో కూర్చుందామా? పదండీ,.... మనం వెళ్ళి వెతుకుదాం! పాప కనిపించేవరకూ నేను ఇంట్లో కూర్చోలేను'' ఏడుస్తూ లేచి నుంచుంది లక్ష్మి.

భార్య కంగారుపడుతుందని ఇంటికి వచ్చాడేగాని రామనాథం కూడా ఇంట్లో కూర్చోలేకపోతున్నాడు. ఏడుస్తూన్న 'చిట్టిముఖం' కళ్ళముందు మెదిలి తమని పిలుస్తూన్నట్లుగా అనిపిస్తూంది. పాప ఏమైపోయిందో అని ఆ పితృహృదయం తల్లడిల్లి పోతూంది. డబ్బు విరజిమ్మి.... పలుకుబడి ఉపయోగించి అప్పటికప్పుడు పదిమందినీ పదిచోట్లకీ పరుగులు పెట్టించి వెతికించే సమర్థత లేని మామూలు గుమాస్తా, బాధపడటంకన్నా అలాంటి సమయాలలో ఏంచేయగలడు?

ఇద్దరూ కలిసి వీధి వీధి తిరిగినా .... ఆశగా అన్నిమూలలా వెతికినా ఫలితం లేదు. పాప కనిపించలేదు. ఆశ నిరాశగా మారిపోతూంది. కాళ్ళల్లో శక్తి సన్నగిల్లుతుంది. అయినా వాళ్ళు వెతుకుతూనే ఉన్నారు.

* * *

అప్పటివరకూ తన ప్రతాపంతో ప్రకృతిని శాసించిన సూర్యుడు ఎండ తీవ్రతను తట్టుకోలేకపోతూన్న ప్రాణి కోటిపై జాలి కలిగినట్టుగా మబ్బుల చాటుకు తప్పుకున్నాడు. అదే అదనని ఎక్కడెక్కడికో పారిపోయిన మబ్బులన్నీ ఆకాశంలో గుమిగూడి ఉరుములు, మెరుపులతో తమ ఉత్సాహాన్ని ప్రకటించుకుంటున్నాయి. అయిదు గంటలకే చీకట్లు ముసురుకున్నాయి. సన్నని తుప్పర ప్రారంభమయింది. చెట్టునీడన నిలబడిన పాప భయంతో వణికి పోతూంది. ఉదయం పదిగంటలకు అన్నం తినగానే, తల్లికి తెలియకుండా ఏదో ఊరేగింపుకోసం వీధిలోకి వచ్చేసిన చిట్టి దారి తప్పిపోయింది. ఊరేగింపుతో తిరగడం సరదా తీరి, ఇల్లు గుర్తుకివచ్చే సరికి ఇల్లు వదిలి చాలా దూరం వచ్చేసిన పాప తిరిగి ఇంటికి చేరుకోలేక ఏడుస్తూ కనిపించిన దారివెంట నడిచి ఊరికి దూరంగా ఉన్న రోడ్డు చేరుకుంది. ఆరేళ్ళ పాప... ఆకలితో....ఇల్లు కనిపించని భయంతో....'అమ్మా' అని ఏడుస్తూ రోడ్డుమీద నడుస్తున్నా...ఎవరూ పట్టించుకోలేదు. వీధిలోకి పరుగెడుతూ తన చిన్నజోళ్ళు తొడుక్కున్న పాపకి కాళ్ళ

కాలకపోయినా, దాదాపు ఆరుగంటల నుంచి ఎండలో తిరిగి అలసిపోయి ఇంక నడువలేక చెట్టుక్రింద నిలబడి 'అమ్మా' అని బిగ్గరగా ఏడుస్తూంది. ఉరుములు, మెరుపులు పాపని మరింత భయపెడు తున్నాయి. చూసేవాళ్ళకి జాలిగొలిపే టట్టు....ఊరికి దూరంగా....అంతకంతకీ జోరవుతూన్న వానలో....చెట్టుక్రింద ఒంటరిగా నిలిబడిన పాప ఏడుపు వినే వారు, ఆమెను చేరదీసేవారు ఎవరూ లేరు.

* * *

రామనాధం, లక్ష్మి వెతుకుతూనే ఉన్నారు. వీధులన్నీ, సందులన్నీ తిరిగారు. ప్రారంభమవుతూన్న వానని చూసి, ఆ వానలో పాప స్థితి ఊహించు కుని వాళ్ళ మనసులు వణికిపోతున్నాయి.

''ఏమండీ, ఈ వానలో చిట్టి....'' ఏమనాలో తెలియక కొంగుతో నోటికి అడ్డుపెట్టుకుని బావురుమంది లక్ష్మి.

''ఎందుకు ఏడుస్తూంది ఆవిడ?'' ఎవరో ఒక నిముషం ఆగి పలుకరిం చారు.

''మా పాప కనిపించటంలేదు. ఆరేళ్ళ పాప. నీలం గౌను వేసుకుంది. మీరు ఎక్కడైనా చూశారా?'' అప్పటికి ఎన్ని సార్లు ఎంతమందిని అడిగారో ఆ ప్రశ్న?

''ఏమో, మీ పాప ఎవరో మాకేం తెలుసు!'' నిర్లక్ష్యంగా అని ముందుకు సాగిపోయారు వాళ్ళు.

''నువ్వు ఇంటికి వెళ్ళు. నేను రిక్షా మాట్లాడుకుని ఇంకా ముందుకి ఊరి చివరి దాకా వెళ్ళి చూసివస్తాను.'' ఇంకా ఇంకా వెతకాలనే ఆ తండ్రి ఆత్రం!

''నేనూ వస్తాను.'' ఒంటరిగా ఇంటికి వెళ్ళలేదు ఆ తల్లి.

రిక్షాకోసం చూస్తూ జేబులు తడుము కున్న రామనాధం ఆగిపోయాడు. నెలాఖరు రోజులు. చేతికి తగిలిన అర్ధ రూపాయి బిళ్ళ ''ఇంకేం వెతుకుతావు? పద ఇంటికి'' అని నవ్వినట్టనిపించింది.

పళ్ళబిగువున బాధని అదిమిపెట్టాడు రామనాధం. ''ఇంటికి పద! ఎవరినైనా అడిగి డబ్బుతీసికొని వెతుకుదాం!''

భర్త జేబు ఖాళీ అని గ్రహించడానికి ఎంతోసేపు పట్టలేదు ఆమెకి.

* * *

సన్నగా పడుతున్న వర్షంలో నున్నటి తారురోడ్డుమీద దూసుకుపోతూంది సరికొత్త అంబాసిడర్! ఆ కారులో ఉన్నది ఆ ఊరిలో పేరుపొందిన ధన వంతుడు రంగనాధం! అతనికి ఇంటికి ఎప్పుడు చేరుకుంటానా అని ఆత్రంగా ఉంది! అతని ఆలోచనలన్నీ తన ఒక్కగానొక్క కూతురిమీదే ఉన్నాయి. ఈ రోజే పొరుగూరు వెళ్ళవలసివచ్చింది బిజినెస్ విషయంలో. వెళ్ళిన పని అయినా ఆ సంతోషంలేదు. ఎంత త్వరగా వద్దామన్నా కుదిరిందికాదు. బేబీ బర్త్‌డే పార్టీ మొదలయిపోయిందేమో! తన

కోసం పేచీపెడుతూంటుంది. విసుగ్గా వాచీ చూసుకున్నాడు. అయిదున్నరవు తూంది. పార్టీ అయిదున్నరకే! ఈపాటికి అతిథులు విచ్చేసి ఉంటారు. తనకోసం వెయిట్ చేస్తూంటారు. అరె... వాన పెద్దదవుతూందే, అందరూ వస్తారా?.... ఆ.... రాకుండా ఎలా ఉంటారు? పట్టణంలో ప్రముఖ వ్యాపారస్తుడు, లక్షలకధికారి రంగనాధం పిలవటం, ఎవరైనా రాకపోవడమూనా— గర్వంగా నవ్వుకున్న అతను కారు స్పీడుని పెంచబోయి సడెన్ బ్రేక్ వేశాడు. ఒక్క కుదుపుతో ఆగిపోయింది కారు. కారుకి కొద్దిదూరంలో రోడ్డుమీద ఏడుస్తూ అడ్డుగా నుంచుంది ఒక పాప!

తల బయటకు పెట్టి విసుగ్గా చూశాడు రంగనాధం.


"ఏయ్ పాపా! అడ్డులే!" కసిరినట్టుగా అన్న ఆ మాటలు విని అతని వైపు చూడటానికే భయమేసినా— ఒంటరిగా వానలో నిలబడిన పాపకి.... చుట్టుప్రక్కల మనుష్యులు ఎవరూ కనిపించక హడలిపోతూన్న ఆ పసి మనసుకి ఆ క్షణంలో కారులోని వ్యక్తి ఆత్మీయుడులా కనిపించాడు.

"నేను.... నేను.... మా అమ్మ...." వెక్కి వెక్కి పడుతూ ఏదో చెప్పాలని నోరువిప్పింది, కాని తన పరిస్థితి వివరంగా చెప్పి సహాయం అడిగేటంత వయసూ లేదు. ఆ తెలివితేటలూ లేవు.

త్వరగా ఇంటికి చేరుకోవాలని ఆత్రపడుతూన్న రంగనాధానికి ఇదంతా న్యూసెన్సులా చిరాకు కలిగించిందే కాని.... అంత చిన్నపిల్ల, ఇంత వానలో ఎందుకు ఒంటరిగా నిలబడి ఏడుస్తూంది. కొంచెం బుజ్జగించి అడిగి వివరాలు తెలుసుకోవడం తనలో ఏపాటి మానవత్వం ఉన్నా తన బాధ్యత అని అనుకోలేదు. అతని దృష్టి అంతా తన ఇంటికి పార్టీకి వచ్చే ప్రముఖుల మీదా తన చిన్నారి కూతురిమీదా లగ్నమయి ఉంది. మాసిపోయిన గౌనుతో, నీరసించిన ముఖంతో దీనంగా కనబడుతూన్న పాప ఆ లక్షాధికారి దృష్టిని ఏమాత్రం ఆకర్షించలేకపోయింది.

"ఛీ! ఛీ! వెధవ న్యూసెన్సు! ఈ దరిద్ర దేశంలో ముష్టివాళ్లు ఎక్కువయిపోయారు. రకరకాల వేషాలు. దీని తల్లో తండ్రో ఏ చాటునో నిలబడి పిల్ల చేత కార్లు ఆపిస్తున్నారు. అసలే ఆలస్యమయిందనుకుంటే... ఈ దరిద్రపు గోల ఒకటి! ఏయ్! కారుకి అడ్డు తప్పుకో!" మొదటికన్నా కఠినంగా కసిరి కారు స్టార్టు చేశాడు. పాపని తప్పించుకుని రయ్యిన దూసుకుపోయింది అంబాసిడర్!

ఎవరో రాక్షసుణ్ణి చూసినంతగా భయపడిన పాప ఏడవటం కూడా మర్చిపోయి వెళ్ళిపోతూన్న కారువైపు భయం భయంగా చూస్తూ నిలబడింది.




సాటి మానవుడికే లేని జాలి నాకెందు కన్నట్టుగా అంతవరకు చిన్న తుప్పరగా ఉన్న వాన విజృంభించటం ప్రారంభించింది.

పూర్తిగా తడిసిపోయింది పాప ఏడవడానికి కూడా ఓపిక లేక "అమ్మా.... ....మ్మా" అని మెల్లిగా వెక్కుతూ రోడ్డు ప్రక్కనే కూర్చున్న పాప ఏ క్షణంలోనైనా స్పృహ తప్పేటట్టుగా ఉంది.

* * *

"ఏడుకొండలవాడా! వెంకటరమణా! మా పాపని నువ్వే కాపాడాలి. ఏ ఆపదల పాలూ కాకుండా రక్షించు తండ్రీ!" భగవంతుడిని స్మరిస్తూ ధైర్యం తెచ్చు కుందుకు ప్రయత్నిస్తూంది తల్లిమనసు.

"ఎదురింటి రామారావుగారు అయిదు, పక్కింటి పిన్నిగారు అయిదు ఇచ్చారు లక్ష్మీ! రిక్షా పిలుచుకుని వచ్చాను. నువ్వూ వస్తావా? నేను వెళ్ళనా?" గుమ్మంలో నిలబడే పిలిచాడు రామనాధం. లోపలికి వస్తే ఆలస్యమయిపోతుందన్నట్టుగా ఉంది అతని ధోరణి.

అతని పిలుపుకన్నా వేగంగా లేచి, బయటకు వచ్చి తలుపు తాళం పెట్టేసింది లక్ష్మి.

హోరుమంటూ పెద్దగా ప్రారంభమయిన వానని లెక్కచెయ్యకుండా రిక్షా ముందుకు కదిలింది. ఎక్కడైనా పాప కనుపిస్తుందేమో అని రోడ్డు కిరు ప్రక్కలా పరీక్షగా చూసుకుంటూ కూర్చున్నారు రామనాధం, లక్ష్మి.

"అరి........ ఈ వాన పెద్దదయి పోయిందే? ఏడనైనా నిలబడడానికి ఈ దారిన ఇళ్లుకూడా ఏమీ లేవే? ఎంత గమ్మున ఒద్దారన్నా కుదిరిందేకాదేస్!

సెల్లమ్మ ఏందో కబుర్లు సెపుతూ నిలబెట్టేసింది." తనలో తను సణుక్కుంటూ గబగబా అడుగులు వెయ్య సాగాడు వెంకన్న. ఆ పట్టణానికి మూడు మైళ్ళ దూరంలో ఒక పల్లెటూరిలో ఉన్న చెల్లెలిని చూసి వస్తున్నాడు అతను.

వానలో తడిసిపోతూనే త్వర త్వరగా నడుస్తూన్న వెంకన్న టక్కున ఆగిపోయాడు, సన్నటి మూలుగులాంటి ఏడుపు విని. ఆశ్చర్యంగా పక్కకి చూసిన అతను కనిపించిన దృశ్యం చూసి మరీ ఆశ్చర్యపోయాడు.

"ఏందది? ఎవరో సిన్న పాపనా గుంది! ఇంత వానలో మడుసులు ఎవరూ లేని ఈ రోడ్డుమీద సిన్నపిల్ల పడి ఉంటమేంది? ఇసిత్రంగా ఉంది!" అనుకుంటూ ఆత్రంగా పాపదగ్గరికి వెళ్ళి చూశాడు.

నీరసంతో కళ్ళుమూసుకుని భయానికి, చలికి వణికిపోతూ ముడిచి పెట్టుకుని కూర్చున్న పాప "అమ్మా అమ్మా" అని ఇంకా ఏడుస్తూనే ఉంది

ఏమీ ఆలోచించకుండా వెంటనే పాపని ఎత్తుకున్నాడు వెంకన్న

తనని ఎవరో ఎత్తుకోవడంతో మెల్లిగా కళ్లు విప్పింది పాప.

"ఎవురమ్మా పాపా నువ్వు? ఈడ వున్నావేంది?" అతని కళ్ళలో కన్పిస్తూన్న ఆప్యాయతని, ఆదరాన్ని గ్రహించిన పాప అతన్ని గట్టిగా కరుచుకుపోయింది ఏడుస్తూ

హోరున కురుస్తూంది వాన! తడసి నీళ్లు ఓడిపోతున్నారు ఇద్దరూ. పాపని మరేమీ అడగకుండా ఆమెని ఎత్తుకునే మళ్ళీ తొందరగా ఇంటివైపు నడవ సాగాడు వెంకన్న! వానలో ఒక్కడే నడవడం కష్టమైతే, పాపని కూడా ఎత్తుకుని మిగిలిన దూరం నడవడం ప్రయాస అయినా ఆ మాటే అనుకోలేదు అతను.

ఉదయంనుండి అమ్మా నాన్నలు కనిపించక సాయంత్రం అక్కడికి చేరుకున్నప్పటినుండి మనుష్యులు ఎవరూ కనుపించక అంత క్రితం కనిపించిన ఒక్కవ్యక్తి ఆమె పసి మనసుకి రాక్షసుడిలా తోచి విపరీతంగా భయపడిన పాప— ఆప్యాయంగా ఎత్తుకుని ఆదరంగా వీపు నిమురుతూన్న వెంకన్న మెడచుట్టూ చేతులువేసి, భుజం మీద తలవాల్చి నిద్రపోయింది నీరసంతో. అప్పటివరకు అతని సహనాన్ని పరీక్షించడానికి అన్నట్టుగా కురిసినవాన వాళ్లు ఇల్లు చేరేసరికి ఓడిపోయినట్టుగా తగ్గిపోయింది.

తలుపుతోసి తమ పాకలో ప్రవేశిస్తూనే ఎదురుగా వాల్చి ఉన్న నులక మంచంమీద పాపని పడుకోబెట్టాడు. తెల్లబోయి చూస్తూండిపోయారు అతని భార్య మంగమ్మ, కొడుకు ఏడేళ్ల వీరన్న!

"సూడే, మంగీ! బంగారు బొమ్మ లాంటి పాప. వస్తంటే రోడ్డు పక్కన

వానలో తడుస్తూ, ఏడుస్తూ కూసునుంది. ఎవురి పాపో? అడ ఎందుకుండాదో? అడ ఎవురూ లేరు. అందుకే నా ఎంట తెచ్చేసినాను." అలా తీసుకురావడం అతి సహజమయిన విషయంలా చెప్పాడు వెంకన్న.

"ఏంది, మావా, నువ్వు సెప్పేది ఇసిత్రంగా ఉంది. ఇంత సిన్న పాప రోడ్డుపక్కన ఒంటరిగా ఉండటమేంది? అడ ఎందుకుంటాదంటావ్?" మంచం మీద కూర్చుని పరిశీలనగా పాపని చూస్తూ, ఆశ్చర్యంగా అంది మంగమ్మ.

"ఇసిత్రమేమరి.... అయినా దారి తప్పిపోనాదేమో. ముందల ఆ పాపకి ఏదైనా పట్టించు. నీర్సంగా ఉంది."

"ఏదైతేనేంలే మావా, సంటిపాపని రోడ్డుమీద ఇడిసిపెట్టకుండా తెచ్చావు. మంచిపనే చేశావు. గమ్మునపోయి ఏడ నన్నా పాలు పట్టుకురా. బేమ్మల పాప నాగుంది. మన గంజి తాగుద్దేటి?" పాపని మెల్లిగా లేవదీసి తడిబట్టలు తీసేసి, శుభ్రంగా ఉతికిపెట్టిన వీరన్న లాగు తొడిగి తిరిగి మంచంమీద పడుకోబెడుతూ అంది.

"అవునేస్! మర్సేపోయా?" అని, తానుకూడా పొడిబట్టలు కట్టుకొని, గూట్లోఉన్న జర్మన్ సిల్వర్ గ్లాసును శుభ్రంగా కడిగి, మట్టిభరిణిలో దాచుకున్న డబ్బులు తీసికొని పాలు తీసుకురావడానికి వెళ్ళాడు వెంకన్న.

బలవంతాన లేవదీసి పాలుపట్టాక మెల్లగా కళ్ళువిప్పింది పాప. కొత్త వాళ్ళని, కొత్తప్రదేశాన్ని చూసి ముందు భయపడినా.... వెంకన్న మంగమ్మల ఆప్యాయతతో కూడిన బుజ్జగింపుతో — తాను ఇంటినుండి ఎలా వచ్చింది చిన్న చిన్న మాటలతో చెప్పిందికాని తమ ఇల్లు ఎక్కడో మాత్రం చెప్పలేక పోయింది. కాస్సేపు కబుర్లు చెప్పినట్టే చెప్పి, "అమ్మ కావాలి" అంటూ ఏడుపు మొదలుపెట్టిన పాపని ఊరుకోబెట్టడానికి చాలా కష్టమయిపోయింది వాళ్ళకి. "చీకటి పడిపోయింది కనుక ఉదయం అమ్మ దగ్గరకు తీసుకువెడతాం" అని చెప్పి అతి కష్టంమీద ఏడుపు మాన్పించారు కాని — పాపకి అన్నం పెట్టడమూ సమస్యే అయింది. అన్నం వండడానికి బియ్యమైతే ఉన్నాయికాని పాప తినే కూరలూ పచ్చళ్ళూ కూలిపని చేసుకునే వెంకన్న ఇంట్లో ఎలా ఉంటాయి? ఆ చీకటిలోనే తాను పాచిపని చేసుకునే ఇళ్ళకు వెళ్ళి, వాళ్ళని బ్రతిమాలి కూరా, చారూ తెచ్చింది మంగమ్మ. పాపకి కడుపునిండా అన్నం తినిపించి వాళ్ళు పొందిన తృప్తి మాటలకందనిది. ఆకలి తీరగానే ఉదయంనుండి అలసిపోయిన పాప త్వరగానే నిద్రపోయింది, కాని ఎవరి పాపో తెలియని ఆ పిల్లని వాళ్ళ వాళ్ళకి ఎలా అప్పగించాలో.... అప్ప చెప్పే వరకు ఎంత జాగ్రత్తగా

చూడాలో – అని ఆందోళన పడుతున్న వెంకన్న మంగమ్మలకు మాత్రం నిద్ర లేదు ఆ రాత్రి.

ఉదయం పాప లేచిన దగ్గరనుండీ అన్నీ సమస్యలే వాళ్ళకి। స్నానం చేయించి రాత్రి ఉతికి ఆరేసిన పాప బట్టలు తొడిగింది మంగమ్మ. దాచుకున్న డబ్బులు ఖర్చుచేసి పాపకోసం పాలు, టిఫిను, బిస్కట్టులు తెచ్చాడు వెంకన్న. వెంకన్న, మంగమ్మ, చిన్నవాడైనా వీరన్న – పాపని ఎన్నోవిధాల బుజ్జగించి, ఆమెతో ఆడి.... సంతోషపెట్ట డానికి ప్రయత్నించారు. ఎన్ని చేసినా అమ్మదగ్గరికి తీసికెళ్ళమని వేధించటం మానలేదు పాప. తల్లికోసం ఏడవకుండా బెంగ పెట్టుకోకుండా చిన్న పిల్లల్ని ఆపడం ఎవరితరం ?

* * *

పాపకన్నా ఎక్కువగా బెంగపెట్టుకున్న తల్లిని ఓదార్చడం కూడా ఎవరితరమూ కావడంలేదు. మంచినీళ్ళు కూడా తాగకుండా ఏడుస్తూన్న లక్ష్మిణి ఓదార్చడానికి రామనాధం, ఇరుగు పొరుగు ఆడవాళ్ళు ప్రయత్నిస్తూనే ఉన్నారు. కాని లక్ష్మి దుఃఖం తగ్గటం లేదు. తమ కళ్ళముందే పాపకి ఏదైనా జబ్బుచేసినా, చివరికి ఏ కారణంచేతనైనా పాప చనిపోయినా కూడా ఆ తల్లి తండ్రుల బాధ అంతకంతకి తగ్గి ఉండేదేమో. కాని ఎక్కడ ఏమి బాధ పడుతూందో.... అసలు బ్రతికి ఉందో లేదో తెలియని ఆ స్థితి దుస్సహంకాదా! ఆ పరిస్థితిలో ఏ తల్లితండ్రులైనా మనసు రాయిచేసుకుని దుఃఖించటం మానగలరా ? రెండురోజులు గడిచి పోయాయి, పాప ఇంటినుండి వెళ్ళిపోయి. తన ప్రయత్నం మానకుండా రామనాధం పోలీస్ స్టేషన్‌లో కనుక్కుంటూనే ఉన్నాడు. ఇరుగు పొరుగుల సహాయంతో వెతుకుతూనే ఉన్నాడు. పదే పదే లక్ష్మి భగవంతుని ప్రార్థిస్తూనే ఉంది.

* * *

"ఇయ్యాలైనా పాప అమ్మానాన్నల ఇసయం ఏమైనా తెలిసిందా మావా ?" వెంకన్న సాయంత్రం పాకకి రాగానే ఆత్రతగా అడిగింది మంగమ్మ

"లేదే మంగీ, రిక్షా లాగే అప్పిగాడు, నర్సిగాడు. కూరలు అమ్మే సత్తెయ్య, పాలుపోసే గంగమ్మ కూడా శానా మందిని అడిగినారట, పాప తప్పిపోనా దని వెతుకుతున్నారేమో అని నేను శానామందిని అడిగినాను. ఎవురూ ఎతుకుతున్నట్లు కనిపించలా. ఏం సెయ్యాలో తోసటంలేదే !" బాధగా అన్నాడు వెంకన్న. పోలీస్ స్టేషనులో తెలియచెయ్యాలని ఆ అమాయకులకు తోచలేదు. రెండు రోజులుగా పాప పోషణకి – ఆమెని ఊరడించడానికి సతమత మవుతున్నారు ఆ దంపతులు ...

అప్పటివరకు పేచీపెట్టి ఏడ్చిన పాప.... అప్పుడే వీరన్నతో ఆడుకుందుకు బయటకు వెళ్ళింది. విచారంగా కూర్చున్నారు ఇద్దరూ.

"మంగమ్మా.... ఓ మంగమ్మా.... ఆడ బజారు వీధిపక్క సందులో ఎవరి పాపో తప్పిపోనాదని రెండురోజులుగా ఎతుకుతున్నారంట.... ఈ పాపేనేమో!" పరుగున వచ్చి చెప్పింది పక్క గుడిసెలో ఉంటున్న గౌరమ్మ.

"ఎద? ఎవురు సెప్పారు?" ఒక్క సారిగా అడిగారు ఇద్దరూ.

"నేను పనిచేసే ఇంటికాడకి ఒకా యన వచ్చి మా యజమానితో సెప్తాంటే ఇన్నాను.... వెంటనే నేను ఆయనకి ఈ ఇసయం, మన పాకలు ఉండేచోటు సెప్పేశాను. ఆళ్ళతో సెప్పి తీసుకువస్తానని సెప్పాడా బాబు. ఈసరికి వస్తా ఉంటారు." గబగబ వగర్చుకుంటూ చెప్పేసింది గౌరమ్మ.

"నిజమా, గౌరమ్మా.... ఎంత సల్లని కబురు సెప్పావు? .... పాపకోసం ఆళ్ళెంత బాధపడుతున్నారో! ఆ తల్లీ బిడ్డలు కల్సుకుంటే అదే సాలు."

"దేముడు సల్లగా సూసి....ఈ పాప ఆళ్ళ పాపే అయితే అదురుట్టవంతులమే మేము కూడా." సంతోషంగా అన్నారు మంగమ్మ, వెంకన్న.

కొద్దిసేపటికి రామనాధం, లక్ష్మి ఆత్రతగా వచ్చారు.... వాళ్ళని చూస్తూనే పాప "అమ్మా" అంటూ పరుగున వెళ్ళి తల్లిని హత్తుకుపోయింది.

"మీరు మా ఇల్లు నిలిపారు ... పాప ప్రాణాలేకాదు, మా ప్రాణాలు కూడా నిలబెట్టారు. మీకు ఏమిచ్చి ఋణం తీర్చుకోగలను వెంకన్నా?" కాసేపు ఆనందంతో మాట్లాడలేకపోయినా తర్వాత సంగతులన్నీ తెలుసుకుని వెంకన్న చేతులు పట్టుకుని అన్నాడు రామనాధం.

"అంత మాటనకండి బాబూ....మేం సేసిందేముంది అంతా దేవుని దయ. గొప్పోరు మీరు. రెండురోజులు మా పాకలో ఉండటం మీ పాపకే యిబ్బందయిపోనాది.... అదే మా బాధ.... ఎవురి పాపో ఎంటనే తెల్సుకొని అప్పగించలేకపోయినాం!" వినయంగా అన్నాడు వెంకన్న. పాపకోసం తాము ఎంత కష్టపడ్డదీ, ఎంత ఖర్చుచేసిందీ వెంకన్నగాని, మంగమ్మగాని ఒక్కమాట కూడా చెప్పలేదు. వాళ్ళ మంచితనం చూస్తుంటే రామనాధం దంపతులకి కళ్ళు చెమ్మగిల్లాయి.

"మీరు గొప్పవాళ్లు కాకపోవడమేమిటయ్యా.... దేవుడిలా మా పాపని ఆదుకున్నారు. ఇక కనుపించదేమో.... ఏమైపోయిందో అనుకున్న పాపని పువ్వుల్లో పెట్టినట్టు అప్పగించారు. ఈ రెండు రోజులు పాపతో మీరెంత ఇబ్బంది పడి ఉంటారో? జన్మ జన్మలకీ మీ

ఋణం తీర్చుకోలేము ఈ మాట తప్పించి మా కృతజ్ఞత తెలియచేసే మాటలు కూడా ఏమీలేవు" చేతులు జోడించి వెంకన్నకీ మంగమ్మకీ నమస్కరిస్తూ అంది లక్ష్మి.

ఎంతోసేపు ఎన్నోవిధాల వాళ్లకి కృతజ్ఞతలు తెలియచేసుకుని పాపని తీసుకుని ఇంటికి వెళ్ళిపోయారు రామనాథం, లక్ష్మి పాపని తల్లితండ్రు లకి అప్పగించామన్న సంతోషంతో తృప్తిగా నిట్టూర్చారు వెంకన్న, మంగమ్మ అ మర్నాడు జీతం తీసుకో గానే- అంతకన్నా ఎక్కువ ఇచ్చుకునే శక్తి లేదనీ, వాళ్ళ గొప్పతనానికి వెల కట్టడం ఎంతమాత్రం కాదనీ, తమ సంతోషం తెలియచేసుకుంటున్నాననీ వెంకన్నకి, రామనాథం వందరూపాయలు బహుమతి ఇవ్వబోవడం వాళ్లు అవి తీసుకుందుకు ఎంతమాత్రం ఒప్పుకోక, చివరికి అతి బలవంతంమీద పాప కోసం వాళ్లు ఖర్చుచేసిన డబ్బుమాత్రం తీసుకోవడం జరగవలసిన విధంగా జరిగిన సహజమైన విషయం!

కాని అసహజమైన విషయాలుకూడా కొన్ని జరిగాయి. అవేమిటంటే,

అదేరోజున,

ఆ పట్టణ ప్రముఖులలో ప్రముఖుడు, వ్యాపారవేత్త- లక్షల కధికారి రంగ నాధం—ఆ వూరి "అనాధశరణాలయము" ట్రస్ట్‌బోర్డుకి ఛైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నిక కావడం!

అప్పుడు, ఆ వూరి పెద్దలందరూ రంగనాధంగారంతటి గొప్పవాడు ఆ వూరిలో మరెవరూ లేరని ముక్తకంఠంతో స్తుతించడం!

వాళ్ళందరి పొగడ్తలు వింటూ గర్వంగా మెళ్ళో దండలు సవరించు కుంటున్న రంగనాధానికి- తాను మూడు రోజుల క్రితం ఏ దిక్కూలేకుండా రోడ్డు మీద వంటరిగా నిలబడిన ఒక చిన్న పాపని అదుకోగలిగి ఉండికూడా అదు కొనక నిర్లక్ష్యంగా కఠినంగా కసురు కున్న సంగతి ఏమాత్రం గుర్తులేక పోవడం!

భగవంతుడు ఇదంతా గమనించి ఉంటే- ఏమనుకుంటాడు? పొగుడుతూన్న మూర్ఖులకీ, పొగిడించుకుంటున్న మూర్ఖ శిఖామణికీ గొప్పతనమంటే ఏమిటో తెలియదని, తన దృష్టిలో- నిజమైన గొప్పవాడు ఎవరో వాళ్లు ఎప్పటికీ తెలుసుకోలేరని-అనుకుని చిద్విలాసంగా నవ్వుకుంటాడు బహుశా!